

సంగారెడ్డి జిల్లాలో మరో రెండు కేజీబీవీలు

సంగారెడ్డి అర్బన్, మే 21 : సంగారెడ్డి జిల్లాకు మరో రెండు కస్తూర్బా గాంధీ విద్యాలయ్యాలు (కేజీబీవీలు) మంజూరయ్యాయి. నాగల్‌గిద్ద, వట్‌పల్లిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. 40 సీట్ల చొప్పున 6, 7 తరగతుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఎన్నికలకోడ్ ముగిసిన తర్వాత సిబ్బందిని భర్తీ చేయనున్నారు. తాత్కాలికంగా నాగల్‌గిద్దకు మంజూరైన కేజీబీవీని నారాయణఖేడ్‌లో, వట్‌పల్లికి మంజూరైన కేజీబీవీని అందోల్‌లో కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. రెండింటితో కలిపి జిల్లాలో కేజీబీవీల సంఖ్య 22కు చేరింది.



కాగితాల్లో నిధులు కానరాని పనులు..!

- సర్కారు ఆసుపత్రులకు సుస్తీ
- పైసలు లేక.. పనులు సాగక..
- నత్తనడకన భవన నిర్మాణాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 21 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసిన సర్కారు ఆసుపత్రుల భవన నిర్మాణాలు ముందుకుసాగడం లేదు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా గడువులోపు నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. జహీరాబాద్‌లో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనం, వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.7.5 కోట్లను మంజూరు చేసింది. టీఎస్ఎంఎస్ఐడీసీకి భవన నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు లోపు నిర్మాణం పూర్తిచేయాలని టీఎస్ఎంఎస్ఐడీసీ 2022 డిసెంబర్‌లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నది. అగ్రిమెంట్ గడువు ముగిసినా భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పూర్తిచేయలేదు. చేసిన పనులకు ఒక్క రూపాయి బిల్లును కూడా విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిదానంగా సాగిస్తున్నట్టు తెలుస్తున్నది.

క్రిటికల్ కేర్ యూనిట్‌దీ అదే పరిస్థితి..

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జీజీహెచ్ ఆవరణలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.23.75 కోట్లను మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణం బాధ్యతలను కూడా టీఎస్ఎంఎస్ఐడీసీ చేపట్టింది. ఇందుకోసం ఆ సంస్థ గతేడాది జూలైలో కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే నవంబరు లోపు భవన నిర్మాణాన్ని పూర్తిచేయాల్సి ఉన్నది. భవన నిర్మాణం పూర్తయితే టీఎస్ ఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించి క్రిటికల్ కేర్ యూనిట్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే ప్రమాదాల బారినపడినవారి ప్రాణాలను కాపాడే అవకాశాలుంటాయని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం రూ.3 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో భవన నిర్మాణం గడువు లోపు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. పూర్తయిన పనులకు బిల్లులు విడుదల చేస్తేనే త్వరితగతిన భవన నిర్మాణంను పూర్తిచేసే అవకాశాలుంటాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తామేమీ చేయగలమని ప్రశ్నిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

రూ.70 కోట్లకు రూ.7 కోట్లే విడుదల

మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరులో కార్పొరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణానికి గత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భవన నిర్మాణాలకు రూ.70 కోట్లను మంజూరు చేస్తున్నట్టు 2022లో పటాన్‌చెరులో జరిగిన సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈమేరకు నిర్మాణ బాధ్యతలను టీఎస్ఎంఎస్ఐడీసీకి అప్పగించగా, అదే సంవత్సరం జూలైలో కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. వచ్చే అక్టోబరులో భవన నిర్మాణాన్ని పూర్తిచేయాల్సి ఉన్నది. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.7 కోట్లనే విడుదల చేయడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చిక్కుల్లో పడింది. భవన నిర్మాణ పనులను ఆపకపోయినా నిదానంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తేనే భవనాలు త్వరితగతిన పూర్తయి ప్రజలకు అదునాతన వైద్య సదుపాయాలు అందే అవకాశాలుంటాయి. తన సొంత జిల్లాలో ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తిచేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిజాంపేటలో పల్లె దవాఖాన

అద్దె ఇల్లు .. అరకొర వసతులు

పడకేసిన పల్లె దవాఖానాలు

నిజాంపేట, మే 21 : పల్లె దవాఖానాల పనులు పడకేశాయి. గ్రామీణ పేదలకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రులకు నూతన భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. అరకొర వసతుల మధ్య పెంకుటిల్లలో కొనసాగిస్తున్నారు. నిజాంపేట మండలంలోని మూడు గ్రామాల్లో పల్లె దవాఖానాల భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ. 20లక్షల చొప్పున నేషనల్ హెల్త్ మిషన్ కింద నిధులను మంజూరు చేశారు. చల్మెడ గ్రామంలో పనులు పూర్తిచేశారు. మిగిలిన రెండు గ్రామాల్లో మాత్రం నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిజాంపేటలో భవనం నిర్మించినా.. నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేదు. ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, టెయిల్స్, కలరింగ్ తదితర పనులు మొదలేకాలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. అదనంగా ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. 4 లక్షలు కేటాయించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో అద్దె ఇంట్లో పల్లె దవాఖానాను కొనసాగిస్తున్నారు. అలాగే, కల్వకుంట గ్రామంలో పల్లె దవఖానా కోసం ఇప్పటి వరకు స్థల సేకరణ కూడా జరగలేదు. దీంతో అక్కడ కూడా పాత ఇంట్లోనే ఆసుపత్రి నడిపిస్తున్నారు. సరైన వసతులు లేక గ్రామీణ పేదలకు వైద్యం అందడం లేదు.

- ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ శరత్ కుమార్ వివరణ ఇస్తూ ఎన్నికల కోడ్ కారణాంగా నిధులు విడుదల కాలేదని, త్వరలోనే పనులను పూర్తిచేస్తామని తెలిపారు.



జహీరాబాద్‌లో నత్తనడకన సాగుతున్న ఎంసీహెచ్ భవన నిర్మాణ పనులు



సికింద్లాపూర్‌లో పారిశుధ్య పనుల్లో పంచాయతీ ట్రాక్టర్

పడకేసిన పల్లె పాలన

- నిధులలేమితో గాడితప్పిన పంచాయతీలు
- నిర్వహణ కోసం కార్యదర్శుల తిప్పలు

మెదక్, మే 21 : పల్లెల్లో ప్రత్యేక పాలన గాడితప్పుతున్నది. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ కష్టమవుతున్నది. గ్రామాలలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరణకు ట్రాక్టర్లు కొనుగోలు చేయగా ఇప్పుడు వాటి ఈఎంఐలు భారంగా మారాయి. ట్రాక్టర్ల మరమ్మతులకు వారాల తరబడి సమయం పడుతున్నది. గత ఐదు నెలలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీలకు ఇక్కట్లు తప్పడం లేదు. కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొన్నది.

రూ.33.75 కోట్లు పెండింగ్



జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల నిర్వహణకు ప్రతీ నెల రూ.6.75 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యేవి. గత సంవత్సరం డిసెంబరు నుంచి నిధులు రావడంలేదు. ప్రస్తుతం జిల్లాలోని పంచాయతీలకు రూ.33.75 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కష్టతరంగా మారింది. నెలల తరబడి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని గడ్డుపరిస్థితులను పల్లెసీమలు ఎదుర్కొంటున్నాయి. జిల్లావ్యాప్తంగా 1,724 మంది పారిశుధ్య కార్మికులకు ప్రతీ నెలా రూ.9,500 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉంది. వీరితో పాటు మండలస్థాయిలో ఉన్న ఆపరేటర్లకు నెలనెలా జీతాలు ఇవ్వాలి. ప్రతీ పంచాయతీలలో ట్రాక్టర్ల నిర్వహణకూ నిధులు అవసరం. చిన్నపాటి మరమ్మతు వచ్చినా నెలల తరబడి ట్రాక్టర్ షెడ్డులో ఉండిపోవాల్సి వస్తోందని ప్రత్యేకాధికారులు వాపోతున్నారు. పాలకవర్గం ఉన్న సమయంలో అప్పులు చేసైనా తెచ్చి గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పూనుకునేవారు. బిల్లులు మంజూరయినప్పుడు తీసుకునేవారు. ఇప్పుడు నిధులు లేక ప్రత్యేకాధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదు.

కరెంటు కష్టాలు

గ్రామ పంచాయతీలు కరెంటు కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్నాయి. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోకపోవడంతో అంతకుముందు నిర్మించిన నీళ్ల ట్యాంకులకు పంచాయతీ సిబ్బంది మోటార్లను బిగించి అవసరాలకు వాడుతున్నారు. దీంతో విద్యుత్ బిల్లులు అధికమవుతున్నాయి. మెదక్ జిల్లాలో గ్రామాల్లో విద్యుత్ వినియోగ బిల్లులు సగటున రూ.80 లక్షల వరకూ ఉంటాయి. ప్రత్యేక పాలన ప్రారంభం నుంచి విద్యుత్‌చార్జీలు పెండింగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బిల్లులు చెల్లించాలని విద్యుత్‌శాఖ సంబంధిత పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నది. కొన్ని గ్రామపంచాయతీ ఖాతాల్లో నిల్వలున్నా ప్రభుత్వ ఖజానా శాఖకు పంపినా ఈ-కుబేర్‌లో నెలల తరబడి చెల్లింపులకు నోచుకోవడంలేదు. దీంతో విద్యుత్‌శాఖ అపరాధ రుసుం విధిస్తున్నది. విద్యుత్ వీధి దీపాలతో పాటు నీటి వనరులను వినియోగించడానికి కరెంటును వాడడం వలన అధిక బిల్లులు వస్తున్నాయని ప్రత్యేకఅధికారులు వాపోతున్నారు.

ట్రాక్టర్లకు మరమ్మతులెలా!

గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా ప్రతీ పంచాయతీలో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ ఉండాలని నిర్దేశించింది. గ్రామ పంచాయతీలు తమ సొంత నిధులతో వాటిని సమకూర్చుకున్నాయి. ఇంజన్, ట్రాలీ, ట్యాంకర్లకు రూ.8.50 లక్షలు వెచ్చించారు. వీటిని హరితహారం, మొక్కలకు నీరందించడానికి, ఇంటింటికీ చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు పాతబడడంతో వాటి నిర్వహణ వ్యయం పెరుగుతున్నది. టైర్లు అరిగిపోవడం, నట్లు ఊడడం, ఇంజన్ రిపేర్లు తదితరాల మరమ్మతులకు నిధులు లేకపోవడంతో నెలల తరబడి ట్రాక్టర్‌లను వర్క్‌షాపుల్లోనే ఉంచాల్సి వస్తున్నది.

కౌంటింగ్ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 21. లోక్‌సభ ఎన్నికల బ్యాలెట్ కౌంటింగ్‌లో ఎలాటి తప్పిదాలు లేకండా సమన్వయంతో విధులు నిర్వహించాలని సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఏఆర్‌వోలు, ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాస్, జైచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితో కలిసి సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరల్ కౌంటింగ్ నిర్వహణలో మెదక్ నియోజకవర్గానికి 20 రౌండ్లు, నర్సాపూర్ నియోజకవర్గానికి 22 రౌండ్లలో కౌంటింగ్ చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతీ రౌండ్ 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 14 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి లెక్కిస్తారని తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఒక రౌండ్‌కు 119 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి లెక్కింపు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులవారీగా పోలైన ఓట్లు, కౌంటింగ్ ప్రక్రియ తప్పనిసరిగా అభ్యర్థులకు కనబడేలా ఉంచాలని చెప్పారు. కౌంటింగ్ అబ్జర్వర్ పరిశీలన చేసినప్పుడు ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని హెచ్చరించారు.

చివరి గింజ వరకూ వడ్లు కొంటాం

- కొనుగోళ్లలో జాప్యం చేస్తే చర్యలు
- కేంద్రాల్లో తూకం పూర్తయిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి
- ప్రతీ కేంద్రానికి 5 లారీలు : కలెక్టర్ క్రాంతి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

జోగిపేట, మే 21: రైతులు పండించిన చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని అందోలు-జోగిపేట, కన్‌సాన్‌పల్లి, మన్‌సాన్‌పల్లిల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోళ్లలో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుంటిసాకులు చెప్పి కొనుగోళ్లలో జాప్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తూకం పూర్తిచేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఎండ ఎక్కువగా ఉండడం, అకాల వర్షాల నేపథ్యంలో ఉదయం త్వరగా సెంటర్లను తెరిచి కొనుగోళ్ల మొదలు పెట్టాలని ఆదేశించారు. ప్రతీ కేంద్రానికి రోజుకు ఐదు లారీలను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ఏ రోజు కొన్న వడ్లను అదేరోజు మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. మిల్లర్లు కేటాయించినమేర ధాన్యాన్ని తీసుకోవాలని ఆదేశించారు. కోటాకు అనుగుణంగా నిలువ సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. లారీలను త్వరితగతిన అన్‌లోడ్ చేసుకుని లారీలను తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఆమె వెంట పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కొండల్‌రావు, పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి వనజాత, మెప్మా పీడీ గీత, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అరుణ, ఏవో విజయరత్న, అందోలు-జోగిపేట కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు నర్సింహులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో అలసత్వం చూపిన ప్రధానోపాధ్యాయురాలికి కలెక్టర్ క్రాంతి ఆదేశాలతో డీఈవో షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అందోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, అన్నాసాగర్‌లోని ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ క్రాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బడుల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించినా.. అందోలు బాలికోన్నత పాఠశాలలో పురోగతి లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్నప్పుడు విధుల్లో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాబాయికి షోకాజ్ నోటీసు జారీచేయాల్సిందిగా డీఈవోను ఆదేశించారు.



వక్ఫ్ భూమిలో నిర్మాణం కోసం తీసిన పునాది

రూ. 50 కోట్ల భూమికి ఎసరు!

- వక్ఫ్‌బోర్డు స్థలం అన్యాక్రాంతం
- కాపాడటంలో నిర్లక్ష్యం
- ఉన్నత న్యాయస్థానం, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

సంగారెడ్డి టౌన్, మే 21 : జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలో కోట్లాది రూపాయల విలువైన భూమి అన్యాక్రాంతమవుతున్నది. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానం, కలెక్టర్ ఆదేశించినా స్థానిక అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని జిల్లా న్యాయాధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోల నివాస భవనాలకు కూతవేటు దూరంలోనే సర్వే నంబర్ 359లో రూ. 50కోట్ల విలువైన భూమిలో అక్రమార్కులు నిర్మాణాలను చేపట్టారు. వీటిని తక్షణమే తొలగించాలని హైకోర్టు, జిల్లా కలెక్టర్ గతంలో మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కానీ మునిసిపల్ అధికారులు మాత్రం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు లేఖలు రాసి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు కొందరు అనుమతులు లేకుండానే భారీ నిర్మాణాలు చేపట్టగా.. మరికొందరు బేస్‌మెంట్ వేసి, బోర్లు తవ్వి నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు.

నాలుగు నెలల క్రితమే ఉత్తర్వులు

జిల్లా కేంద్రంలోని 359 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని నాలుగు నెలల క్రితమే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కొంతమంది పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించగా జనవరిలో రిట్ పిటిషన్ నంబర్ 1549/2024 ప్రకారం అక్రమ నిర్మాణాలను తొలగించాలని మునిసిపల్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అంతకుముందు 2023 అక్టోబర్‌లో అక్రమ నిర్మాణాలను నియంత్రించాలని అప్పటి కలెక్టర్ సైతం ఆదేశాలు జారీచేశారు. దీంతో మునిసిపల్ అధికారులు నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందానికి లేఖ రాశారు. అప్పట్లో నిర్మాణాలు పునాదిస్థాయిలో ఉండగా.. ప్రస్తుతం కొన్ని ఇళ్లు పూర్తికావస్తున్నాయి.

వక్ఫ్‌బోర్డు నిబంధనలు ఇలా..

నిరుపేదలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో 100 నుంచి 120 గజాల స్థలాన్ని వక్ఫ్‌బోర్డ్ కేటాయిస్తుంది. ఇందులో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం లేదు. ఉపాధి కోసం తాత్కాలిక నిర్మాణాలు చేయడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే 359 సర్వే నంబర్‌లో వక్ఫ్‌బోర్డు నుంచి ఎలాంటి కేటాయింపులు లేకుండానే తప్పుడు పత్రాలను సృష్టించి 300 గజాల నుంచి వెయ్యి గజాల వరకు ఆక్రమించి భారీ భవనాలను నిర్మించారు. రూ.50 కోట్ల విలువైన ఐదెకరాల భూమిలో అక్రమార్కులు పోటాపోటీగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు.



వక్ఫ్ భూమిలో కొనసాగుతున్న నిర్మాణాలు

కోర్టు పరిధిలో ఉంది

సంగారెడ్డిలోని 359 సర్వే నంబర్‌లోని భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినది. అయితే, కొంతమంది ఈ భూమి తమదేనంటూ హైకోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు పరిధిలో ఉంది. 359 సర్వే నంబర్‌లో గతంలో 25 మంది పేదలకు 150 గజాల చొప్పున స్థలం కేటాయించారు. వక్ఫ్‌బోర్డు నిబంధనల ప్రకారం ఆ భూమిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. తాత్కాలిక షెడ్లను నిర్మించుకొని ఉపాధి పొందడానికి మాత్రం అవకాశం ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

-షబ్బీర్ అలీ, వక్ఫ్‌బోర్డ్ అధికారి

హైకోర్టు పరిధిలో ఉన్నా..

సంగారెడ్డిలోని 359 సర్వే నంబర్‌లోని వక్ఫ్‌బోర్డు భూమి సమస్య వివాదస్పదంగా మారింది. ఈ భూమి తమదేనంటూ పట్టణానికి చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు పరిధిలో ఉండగా భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఆక్రమణదారులకు ఈ భూమిని కేటాయించినట్లు వక్ఫ్‌బోర్డు నుంచి ఎలాంటి పత్రాలు లేకపోవడం గమనార్హం. హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి



వడ్లను పరిశీలిస్తున్న భారతి హోళికేరి

7

ఐదేళ్ల కష్టాన్ని అడ్డంగా నరికారు

- చెట్లు నరికారని ఉపాధి కూలీల నిరసన
- విద్యుత్ అంతరాయం కలగొద్దనే : అధికారులు

7



రోడ్డు పక్కన చెట్లను కొట్టడంపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలి

● స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి



ఖేడ్‌లో ఐసీడీఎస్ అధికారులకు సూచనలిస్తున్న లలితకుమారి

నారాయణఖేడ్, మే 21: స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి లలితకుమారి సూచించారు. మంగళవారం ఆమె స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు శ్వేత, వాసవి, రామరాజు, రావణ్‌లతో కలిసి మంగళవారం ఖేడ్ మండలం జుజాల్‌పూర్, మాణిక్‌నాయక్‌తండా, శంకర్‌నాయక్‌తండా, తెట్టె కుంటతండా, జగన్నాథ్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కుటుంబ సర్వేను తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు కౌన్సెలింగ్ ఇవ్వడం, బరువు, ఎత్తులను కొలిచే యంత్రాలను తనిఖీ చేసి అంగన్‌వాడీల టీచర్లు, సహాయకులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలు తెలుసుకుని సలహాలు, సూచనలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● ఓబీసీ ఉద్యోగులు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాటిపల్లి పాండు

సంగారెడ్డి రూరల్, మే 21: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ ఉద్యోగులు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థలు సర్పంచ్, జట్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గతంలో 'ఓట్లు మావి సీట్లు కూడా మావే' అనే నినాదంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను 18 శాతానికి కుదించిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ యువత అధ్యక్షుడు రమేష్, జిల్లా నాయకులు మల్లయ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ విజేత భవానీ టైగర్స్ టీమ్



కప్ అందుకుంటున్న భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన తెలంగాణ దశాబ్ది వేడుకల క్రికెట్ కప్ పోటీలో విజేతగా భవానీ టైగర్స్ టీమ్ నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 21 క్రికెట్ జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయని ఫైనల్ పోటీలో భవానీ టైగర్స్ టీమ్ ఆర్‌వీఎల్‌ఎల్‌ఎస్ మెదక్ టీమ్‌పై విజయం సాధించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ.సంగమేశ్వర్, గౌరవాధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్పలు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కప్‌ను భవానీ టైగర్స్ టీమ్ కెప్టెన్ ప్రశాంత్ అందుకున్నారని వారు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడానికి తమ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్‌తోపాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశామన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట, మే 21: పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ విత్తనాల సరిపడా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనడానికి జోగిపేటలో ఈరోజు జరిగిన విత్తనాల సరఫరానే నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కాకమ్మ కబుర్లు చెప్పిన ప్రభుత్వం తీరా గెలిచాక, రైతులను విస్మరిస్తోందన్నారు. రైతుబంధుకు ఎగనామం పెట్టి, రుణమాఫీని మరిచిన కాంగ్రెస్ సర్కార్.. రూ.500 బోనస్‌ను తుంగలో తొక్కిందని చెప్పారు. దీనికితోడు, ప్రభుత్వం తాజాగా విత్తనాల సరఫరాలోనూ రైతులను ఇబ్బంది పెడుతుందని పేర్కొన్నారు. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్‌కు ఉన్న పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు. అయితే, బీఆర్‌ఎస్ పార్టీగా, మాజీ ఎమ్మెల్యేగా తాము ఎప్పుడూ రైతుల పక్షాన ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు

మునిపల్లి, మే 21: మండల కేంద్రమైన మునిపల్లిలో మంగళవారం రేణుకా ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామ పుర వీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- ఆర్కియాలజీశాఖ కమిషనర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి



తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్‌ను పరిశీలిస్తున్న భారతిహోళికేరి

తూప్రాన్, మే 21: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని ఆర్కియాలజీశాఖ కమిషనర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం రవాణా చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గుండ్రెడ్డిపల్లిలో ఐదులారీలు, మల్కాపూర్‌లో రెండు లారీలు అవసరమని చెప్పగా ఏర్పాటు చేసి ధాన్యం తరలించాలని సూచించారు. భారతిహోళికేరి వెంట అదరనె కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణీ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు మంగళవారం రోడ్డెక్కారు. తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ రోడ్డులో రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో లారీలను సమకూర్చే పనులు చేపట్టారు. రోడ్డున వెళ్లే ఖాళీ లారీలను నిలిపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించారు.

నిలువ ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

చేగుంట, మే 21: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, కేంద్రాల వివరాలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని షేర్‌పల్లి, నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా, జప్తి శివనూర్, సంకాపూర్, వల్లూరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తరలించామని తెలిపారు. ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వహణకురాలుగా పనిచేసిన సీసీ సుల్తానాను, అధికారుల పనితీరును ఆమె అభినందించారు. నార్సింగి కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నాయని, వాటిని త్వరలో తరలించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.



చేగుంట: నార్సింగిలోని కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న భారతిహోళికేరి

తహసీల్దార్ కార్యాలయ సందర్శన

చేగుంట తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యాన్ని రెండు, మూడురోజుల్లో రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నార్సింగి, చేగుంట తహసీల్దార్లు ఖరీమ్, గియ వున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ చివరిదశకు చేరింది

దుబ్బాక, మే 21: జిల్లాలో ధాన్యం సేకరణ చివరి దశకు చేరిందనీ, కొనుగోలు చేసిన రెండు, మూడురోజుల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లోకి చేరుతున్నాయని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలును రెండు, మూడురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ జయదేవ్ హర్యా, జిల్లా పౌరసరఫరాల అధికారి హరీశ్, డీఎస్‌వో తనూజ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, మే 21: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారి భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి, సంబంధిత అధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదిరోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు, ఇంకా రావాల్సిన ధాన్యంపై జిల్లా వ్యవసాయ అధికారి పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ డీఆర్డీఏ జయదేవ్‌ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

- డబ్బుల కోసం కుమారుడే చంపాడని అనుమానం



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

కొండాపూర్, మే 21: కొండాపూర్‌కు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు అనుమానాస్పదంగా చనిపోగా, ఆస్తి అమ్మిన డబ్బులు తనకు ఇవ్వడం లేదన్న కోపంతో ఓ కుమారుడు తల్లిని చంపినట్లు అనుమానిస్తున్నారు. కొండాపూర్ ఎస్ఐ హరికుమార్ కథనం ప్రకారం.. మారెపల్లి గ్రామానికి చెందిన గంజాయి రత్నమ్మ మంగళవారం తన ఇంట్లోనే అనుమానాస్పదంగా చనిపోయి ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, చాలా ఏళ్ల క్రితమే ఓ కుమారుడు, కుమార్తె చనిపోయారు. అయితే, గంజాయి రత్నమ్మ తన పేరిట ఉన్న 20 గుంటల భూమిని ఎనిమిది నెలల క్రితం అమ్మేసింది. ఆ డబ్బులను కుమార్తెకు ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె కుమారుడు సామేల్ తరచూ తల్లితో డబ్బుల కోసం గొడవ పడుతుండేవాడు. ఆ సమయంలో రత్నమ్మ తనకు కొడుకు, కూతురు ఇద్దరూ సమానమేనని సర్దిచెప్పేంది. అయితే, మంగళవారం ఇంట్లో ఆమె విగతజీవిగా పడి ఉండటంతో డబ్బుల కోసమే కొడుకు ఆమెను చంపినట్లు గ్రామంలో జరిపిన విచారణలో పలువురు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నైపుణ్యాభివృద్ధికి 'టాటా' సహకారం

- రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలతో ఒప్పందం
- త్వరలోనే సంగారెడ్డి ఐటీఐలో శిక్షణ ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, మే 21: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 'టాటా' సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐ కళాశాలల్లో 'టాటా' సంస్థ సహకారంతో కొత్త కోర్సులపై శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి సహకరించాలని 'టాటా' సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐటీఐ కళాశాల వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ కళాశాలలో 13 రకాల ట్రేడ్‌లలో 340 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరిన్ని కోర్సులను పరిచయం చేసేందుకు కంప్యూటర్ న్యూమరికల్స్ కంట్రోల్(సీఎన్‌సీ) మిషన్స్ ఏర్పాటు చేయాలని, శిక్షణకు సంబంధించి కళాశాల ప్రాంగణంలో ఓ భవనాన్ని నిర్మించేందుకు టాటా సంస్థ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే స్థల పరిశీలన కూడా పూర్తయిందని, భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనాల్లోనే శిక్షణ ప్రారంభిస్తామని కళాశాల వర్గాలు తెలిపాయి. వచ్చే నెలలో కొత్త కోర్సుల్లో శిక్షణ ప్రారంభించే అవకాశాలున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజేశ్వర్‌రావు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మంచి క్రీడాకారులుగా ఎదగాలి

- సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి
- ముగిసిన క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 21: ప్రతి ఒక్కరూ మంచి క్రీడాకారులుగా ఎదగాలని సైబర్ క్రైమ్స్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. శారీరక దృఢత్వం పెరిగేలా ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సూచించారు. ఎక్కడైతే క్రికెట్ అసోసియేషన్ బలంగా ఉంటుందో అక్కడ మంచి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంటుందన్నారు. లేనిచోట క్రీడాకారులకు సరైన వసతులు, సౌకర్యాలుండవన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని, క్రీడలు దినచర్యలో భాగమని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కాగా మంగళవారం ఎంఎస్ అకాడమీలో అండర్-25, టీ-20 జట్టుకు జరిగిన ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలకు 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి, కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి, ఇనాం, రియాజ్, మధుమోహన్, తోహిద్, జితేందర్‌రెడ్డి, ధారాసింగ్, విజయ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నాదే

- సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా



చౌకూర్‌లో ఎల్లమ్మ మాత ఆలయ వార్షికోత్సవానికి హాజరైన జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్‌కల్, మే 21: జహీరాబాద్ పార్లమెంట్‌లో తానే గెలుపొందుతానని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం కేంద్రంలో కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హవా కొనసాగుతుందని, ఆయనను ప్రజలు మూడోసారి ప్రధాని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛందంగా ఓట్లు వేశారని తెలిపారు. దేశ ప్రధానిగా ఎవరు ఉండాలో ప్రజలు ఎప్పుడో తేల్చారని, ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఐదు విడతలుగా పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయని, ఈ నెల 25న ఆరో విడత, జూన్ 1న ఏడవ విడత ఎన్నికల పూర్తి కానున్నాయన్నారు. నరేంద్రమోదీకి స్పష్టమైన తీర్పునిచ్చారని, 400కు పైగానే పార్లమెంట్ స్థానాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటింగ్ సరళిలో స్పష్టమైన ఆధిక్యతను చాటామని, గెలుపుపై తమకు ఎలాంటి అనుమానం లేదన్నారు. ఎన్నడూ లేనంతగా దక్షిణ భారతంలో మోదీ హవా కొనసాగిందని, సర్వేలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. తెలంగాణలో పదికిపైగా స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తామని ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. 2019లో వచ్చిన సీట్లకంటే అదనంగా సీట్లలో పాగా వేయడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోగా, ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, బీజేపీ మండలాధ్యక్షుడు నీరుడి ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్, నాయకులు రమేశ్ బస్వరాజ్ పాటిల్, పలువట్ల జగదీశ్వర్, సార రాజ్‌కుమార్, పల్లె ప్రభుకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బీజేపీదే

- పార్లమెంట్ అభివృద్ధి కోసం కృషి
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, మే 21: తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పాపన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 100 మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలనే కాంక్షతో అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. బీజేపీ బలపరిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అన్ని గ్రామాల్లోని యువకులు సంఘటితమై మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత మీలో ఒకడిగా పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, మండలాధ్యక్షులు రాములు, ప్రభాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారినపడకుండా అవగాహన కల్పించాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్



తూప్రాన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న సైబర్ వారియర్స్, సిబ్బంది

తూప్రాన్, మే 21: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అవగాహన కల్పిస్తూ బాధ్యతగా మెలగాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. మంగళవారం తూప్రాన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జూన్ 8న మెగా లోక్ అదాలత్ ఉన్నందున సైబర్ నేరాల పరిష్కారానికి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతపరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారని వివరించారు. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, భద్రతకు ముప్పు కలిగించడం వంటి నేరాలకు సైబర్ నేరగాళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. రోజువారి కార్యక్రమాలు అన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం వల్ల నేరాల సంఖ్య కూడా పెరిగిందన్నారు. సాధారణంగా ప్రజలు ఆశ, భయం వల్ల సైబర్ నేరాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. బాధితులు పోగొట్టుకున్న డబ్బులను వారికి తిరిగి ఎలా రీఫండ్ చేయాలి..? అనుమతి బ్యాంకు స్టేట్‌మెంట్లను ఎలా సేకరించాలి? బాధితులు పోగొట్టుకున్న డబ్బులు పొందేందుకు ఎలా ఫిర్యాదు చేయాలి..? ఏఏ అంశాలను, పత్రాలను జతచేసి ఇవ్వాలని అనే అంశంపై సైబర్ వారియర్స్, సిబ్బందికి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు, సైబర్ వారియర్ సిబ్బంది పాల్గొన్నారు.

24న మామిడిపండ్ల వేలం పాట



సంగారెడ్డి జిల్లా జైలు ఆవరణలో ఉన్న మామిడిచెట్లు

కంది, మే 21: కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు ఆవరణలో ఉన్న మామిడిచెట్లకు కాసిన పండ్లకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైలు ఆవరణలో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులతో పండించిన మామిడిపండ్లలో దసేరి, బంగినపల్లి, పెద్దరసాలు లాంటి వివిధ రకాల పండ్లు ఉన్నాయన్నారు. జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేలంలో వ్యాపారస్తులు రూ.5 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని భరత్‌రెడ్డి కోరారు.

ఐదేళ్ల కష్టాన్ని అడ్డంగా నరికారు

- నిరసన వ్యక్తం చేసిన ఉపాధి కూలీలు



చెట్లను తొలగించడంతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

కొండాపూర్, మే 20: ఐదేళ్ల నుంచి మొక్కలు నాటి సంరక్షణ కోసం చుట్టూ కంచె వేసి పెంచిన చెట్లను అడ్డంగా నరకడాన్ని నిరసిస్తూ ఉపాధి కూలీలు మల్కాపూర్ నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను రక్షిస్తూ ఉపాధి పొందుతున్న తమకు గుర్తింపు లేకుండా చేశారని వాపోయారు. ఈ విషయమై గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి నౌషద్ ఫాతిమాను వివరణ కోరగా.. పంచాయతీ అనుమతి లేకుండానే చెట్లను తొలగించారని సమాధానమిచ్చారు. విద్యుత్‌లో అంతరాయం ఉండొద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చెట్లను తొలగించామని కొండాపూర్ విద్యుత్ ఏఈ సిద్దిరాజ్ పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత: డీఎల్పీవో

నిజాంపేట, మే 21: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్పీవో సతీష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులతో పాటు గ్రామపంచాయతీలోని ఆస్తుల వివరాలు పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని హరితహార నర్సరీ, పల్లె ప్రకృతివనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలను పపరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ పల్లె ప్రగతి పనుల పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో పండ్లను సాగు చేయాలి

- కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డి.నీరజాప్రభాకర్
- ఎఫ్ఆర్ఎస్‌లో 265 రకాల మామిడి పండ్లు



సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో ప్రదర్శనలో ఉంచిన మామిడి పండ్లను పరిశీలిస్తున్న కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజాప్రభాకర్

సంగారెడ్డి రూరల్, మే 21: రైతులు ఆధునిక పరిజ్ఞానంతో మామిడి పండ్లను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డి.నీరజాప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో మంగళవారం మామిడిపండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సంగారెడ్డిలో గల ఎఫ్ఆర్ఎస్‌లో 265 రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడిపండ్లను సాగుచేసే సమయంలో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగుచేస్తే నాణ్యమైన పండ్లు వస్తాయని, పండ్ల కోతల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మామిడి పండ్లన ఎండబెట్టి ఆమ్‌చూర్‌ని ఎఫ్ఆర్ఎస్‌లో 1994 నుంచి 1999 వరకు తయారు చేశారని గుర్తుచేశారు. కాలం మారిన కొద్దీ వివిధరకాలుగా రుచికరంగా ఆమ్‌చూర్‌ని తయారు చేస్తున్నారన్నారు. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అనేక రకాల మామిడిపండ్లను సాగుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. రైతులు మామిడి పండ్లను సాగుచేసేందుకు ముందుకు రావాలని నీరజాప్రభాకర్ కోరారు. ఇదిలా ఉండగా ఎఫ్ఆర్ఎస్‌లో నిర్వహించిన మామిడిపండ్ల ప్రదర్శనలో అధికారులు, సిబ్బంది తప్ప ఎవరినీ ఆహ్వానించలేదని, సమాచారం లేక ఇద్దరు ముగ్గురు రైతులు మాత్రమే హాజరయ్యారు. ఎఫ్ఆర్ఎస్ అధికారులు రైతు సంఘాల నాయకులు, ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే ప్రదర్శనను ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి.

ప్రదర్శనలో కుళ్లిన మామిడిపండ్లు



ప్రదర్శనలో కుళ్లిన మామిడి పండ్లు

సంగారెడ్డిలోని ఫల పరిశోధనా కేంద్రంలో ఎంతో ఆర్భాటంగా ఏర్పాటుచేసిన మామిడి పండ్ల ప్రదర్శనలో కుళ్లిన పండ్లు దర్శనమిచ్చాయి. ప్రదర్శనకు వచ్చిన వారు కుళ్లిన పండ్లను చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అక్కడే ఉన్న ఎఫ్ఆర్ఎస్ అధికారులను అడగగా పొరపాటున వచ్చాయని వాటిని ప్రదర్శనలో నుంచి తీసివేశారు. ఈ కార్యక్రమంలో ఫల పరిశోధన శాస్త్రవేత్తలు డా.కిరణ్‌కుమార్, డా.హరికాంత్, డా. మాధవి, డా.మౌనిక, డి.నితీష్, ఉద్యానవన శాఖ అధికారి సమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వివిధ రకాల మామిడి పండ్లతో ఎఫ్ఆర్ఎస్ మహిళా అధికారులు

అధికధరలకు రసాయనిక ఎరువులు

● పట్టించుకోని అధికారులు

ఝరాసంగం, మే 21: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో రైతులు ముందస్తుగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేద్దామనే ఉద్దేశంతో ఫర్టిలైజర్ షాప్‌లకు వెళ్తే నిరాశే ఎదురవుతున్నది. మండలంలో వారు చెప్పిన ధరకు తీసుకుంటేనే రసాయన ఎరువులు దొరికే పరిస్థితి ఏర్పడింది. ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని కుప్పానగర్, మాచునూర్, కప్పాడ్, ఏల్గోయి ఆయా గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఒక డీఏపీ బస్తా సుమారు రూ.1,350కి విక్రయించాల్సి ఉన్నప్పటికీ ఫర్టిలైజర్ యజమానులు అదనంగా బస్తాపై 100-150 తీసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇంత ధర అమ్ముతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ఫర్టిలైజర్ షాప్ యజమానిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే, ఆ రైతు పేరును తిరిగి షాప్ యజమానికి తెలియజేస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు వారి కనుసన్నుల్లో ఎంత మేర కొనసాగుతున్నారో అన్న విషయము ఇట్టే అర్థం అవుతుంది. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు బ్లాక్ బోర్డు పై స్టాక్ వివరాలు రాసి ఉంచాలి, కానీ ఎక్కడ కన్పించడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతులకు సకాలంలో రసాయన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న ఫర్టిలైజర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీరు లేక పంటల సాగు మానేసిన రైతులు

మత్తడి పనుల్లో నాణ్యతాలోపంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మెదక్ అర్బన్, మే 21: పుష్పాలవాగు మత్తడి పనుల్లో నాణ్యత లోపం వల్ల నీరు లేక పంటల సాగు మానేసిన రైతులకు న్యాయం చేస్తూ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులతో కలిసి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లి గ్రామ శివారులోని పుష్పాలవాగు మత్తడి కింద దాదాపు 500 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసేవారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా మత్తడి మరమ్మతు పనుల కోసం రూ. 88.20లక్షలు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపంతో మత్తడి పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. వాగులో నీరు లేక రైతులు పంటలను సాగు చేయడం మానేశారని, తిరిగి పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట రైతులు, బీజేపి నాయకులు ఉన్నారు.

తాగునీటి గోసను పట్టించుకునేదెవరు?

● అస్తవ్యస్తంగా 'భగీరథ' నీటి సరఫరా
● తరచూ పైప్‌లైన్ పగిలి తప్పని ఇక్కట్లు
● పది రోజులుగా అప్పాజీపల్లి తండాలో.. 4 రోజులుగా మరో ఐదు గ్రామాలకు సరఫరా బంద్



అప్పాజీలపల్లి తండాలో అలంకార ప్రాయంగా భగీరథ ట్యాంకు, చిల్వర్‌లోని మాందాపూర్ చౌరస్తా వద్ద బగీరథ పైపు పగిలి వృథాగా పోతున్న తాగునీరు

అల్లాదుర్గం, మే 21: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వార కోట్లాదిరూపాయలు వెచ్చించినప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యపై ఖరితో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతున్నది. ప్రస్తుత వేసవిలో మండలంలోని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

కన్నెత్తి చూడని అధికారులు

మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేసే నీటి పైపులు తరచూ పగిలిపోయి, ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. అయినా సంబంధిత అధికారులు ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని అప్పాజీలపల్లి గిరిజన తండాలోని మిషన్ భగీరథ నీటి ట్యాంకు సరఫరా చేసే పైపు పగిలిపోవడంతో గత పది రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి తండాలోని సింగల్ ఫేజ్ బోరు మోటారు ద్వారా నీటిని తెచ్చుకుంటున్నామని, తండావాసులు వాపోతున్నారు. తండాకు ఈ ఒక్కటే బోరు దిక్కువడంతో నీటిని తోడుకునే విషయంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయని తండా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిల్వర్ గ్రామంలోని మాందాపూర్ చౌరస్తా వద్ద గల సర్వీస్‌రోడ్డు పక్కన ఐదు రోజుల క్రితం భగీరథ పైపు పగిలిపోవడంతో చిల్వర్, మాందాపూర్, చౌటాగ్ గిరిజన తండా, గొల్లకుంట, ఐబీ గిరిజన తండావాసులకు నీటి సరఫరా నిలిచిపోయిందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే జాతీయ రహదారి పక్కనే భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన పైపు ధ్వంసమైనా పట్టించుకోని అధికారులు, మారు మూల ప్రాంతాల్లోని సమస్యలపై ఎలా స్పందిస్తారో అర్థమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి నిలచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించి ఆయా గ్రామాలకు భగీరథ నీరందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫోన్ చేస్తే.. ఒక్కరోజే నీటి సరఫరా

తండాలో తరుచూ నెలకొంటున్న తాగు నీటి సమస్య పై సంబంధిత మిషన్ బగీరథ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే మరునాడు ఒక్క రోజు మాత్రమే నీటి సరఫరా చేశారు. ఆ తర్వాత సమస్య యధాతథం. పది రోజులుగా తండాలో నెలకొన్న తాగు నీటి సమస్యపై ఏ అధికారి పట్టించుకోక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నాం.

\- వడ్త్య లక్ష్మణ్. అప్పాజీపల్లి తండా వాసి

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



భగీరథ పైప్‌లైన్ పగలడంతో నీటి ఎద్దడి నెలకొన్నది. తాగునీటి సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించాం. నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాం. సమస్య పరిష్కారానికి మరో రెండు రోజులు పట్టవచ్చు.

\- శంకర్ యాదవ్, ఎంపీడీవో

వరదకాల్వ పూడికతీతకు చర్యలు

● ఉన్నతాధికారులకు నివేదిక పంపిన ఇరిగేషన్ ఏఈ

కంది, మే 21 : 'మురుగునీటితో కంపు కొడుతున్న వరదకాల్వలు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు కంది శివారులోని జాతీయ రహదారి పక్కనే ఉన్న వరదకాల్వలోకి చేరిన మురుగునీటిని మంగళవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఏఈ మజారుద్దీన్ కందిలోని వరదకాల్వలు, కట్టుకాల్వలను పరిశీలించారు. అనంతరం దాబాల నుంచి వరదకాల్వలలోకి వచ్చే మురుగునీటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద, కట్టు కాల్వలను వెంటనే పూడిక తీయిస్తామన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సంప్రదించి వరద కాల్వలోకి అక్రమంగా వేసిన పైప్‌లైన్‌ను తొలగిస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ గౌడ్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పైప్‌లైన్ వాల్వు చుట్టు మురికి నీరు తొలగింపు

కంగ్టి, మే 21: 'పైప్‌లైన్ వాల్వు వద్ద మురికి నీటిని తొలగించండి' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ప్రత్యేక అధికారితో పాటు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించిన వాల్వు చుట్టు నిలిచిన మురికి నీటిని తొలగించడంతో పాటు గుంతను మట్టితో పూడ్చివేయించారు. దీంతో ఎస్సీకాలనీ వాసులు ప్రత్యేకాధికారికి, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వివాదాస్పదంగా మారిన బోరు తవ్వకం

శివ్వంపేట, మే 21: ఓ పార్టీ సాయంతో బోరుబావి తవ్వకం చేపట్టారని మరో పార్టీకి చెందిన నాయకులు అడ్డుకోగా, ఈ సంఘటన వివాదాస్పదంగా మారి ఇరు వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్నది. ఈ ఘటన మంగళవారం గోమారంలో చోటుచేసుకున్నది. మండల పరిధిలో గోమారం గ్రామంలో ఓ పార్టీకి చెందిన నాయకుడి ఆర్థిక సాయంతో బీరప్ప ఆలయం సమీపంలో గొల్లకుర్మలకు చెందిన వ్యక్తులు బోరుబావి తవ్వకాలు నిర్వహిస్తుండగా మరో పార్టీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఇరువర్గీయుల మధ్య తోపులాట ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నది. దీంతో బోరు బావి తవ్వకాన్ని నిలిపివేశారు.

హరీశ్‌రావుతో బొల్లారం కౌన్సిలర్ల భేటీ



హరీశ్‌రావుతో మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

జిన్నారం, మే 21: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్లు కలిశారు. మంగళవారం మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు బీరప్ప, సాయికిరణ్, శ్రీకాంత్‌యాదవ్, నాయకులు పుండరీకం, రత్నం తదితరులు కలిశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి, రాజకీయ పరిణామాలపై మాజీమంత్రితో వారు చర్చించారు.

● **మునిపల్లి:** మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ నాయకులు, పార్టీ స్థితిగతులపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు చిట్కుల వెంకటేశం, చిన్నచెల్మెడ గ్రామ శాఖ అధ్యక్షుడు ఒగ్గు మోహన్ తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి: ప్రిన్సిపాల్ కుమారస్వామి

జహీరాబాద్, మే 21: 2024-25 విద్యాసంవత్సరానికిగాను మే 24న నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్లు రంజోల్ ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతు ఇంజనీరింగ్, నాన్‌ఇంజనీరింగ్ కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా కోసం పాలిసెట్ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు మే 24 నిర్వహించే పరీక్షలకు హాజరు కావాలన్నారు. జహీరాబాద్ 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 11 నుంచి మధాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలోకి 10గంటలకే అనుమతినిస్తారన్నారు.

తుది దశలో ధాన్యం సేకరణ

● కొనుగోళ్ల వేగవంతానికి చర్యలు: కలెక్టర్



మాచవరం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 21. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మెదక్ మండలం మాచవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందన్నారు. యాసంగి సీజన్ ధాన్యం సేకరించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇప్పించి, వారికి కావాల్సిన యంత్రాలు ఇప్పించామన్నారు. ధాన్యం తూకం వేసే యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు ముందుగానే తరలించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ 1,94,666.640 మెట్రిక్ టన్నుల ధాన్యం 44685 మంది రైతుల వద్ద నుంచి సేకరించినట్లు పేర్కొన్నారు. వారికి ఇప్పటి వరకూ రూ.289.28 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. జిల్లాలోని 34 పారా బాయిల్డ్, 23 రా మిల్లులకు కేటాయించామన్నారు. ఇవి కాకుండా మెదక్ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాకు 10,000 మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40,000మెట్రిక్ టన్నుల ధాన్యం పంపించామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకూ 600 లారీలు అందుబాటులో ఉండగా, ఇతర జిల్లాల కోసం మరో 150 లారీలను తెప్పించామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొంటాం.. అధైర్యపడొద్దు



నర్సాపూర్: రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ

నర్సాపూర్, మే 21: తడిసిన ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని, రైతులు అధైర్యపడొద్దని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు రైతులకు భరోసానిచ్చారు. మంగళవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీడీ సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. వచ్చిన ధాన్యంను సిబ్బంది త్వరగా తూకం వేసి కేటాయించిన మిల్లులకు వెంటనే లారీలలో నింపి పంపించాలని సూచించారు. అదేవిధంగా రైతులతో మాట్లాడుతూ.. వర్షానికి తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తారని, రైతులు ఏ మాత్రం ఆందోళన చెందవద్దన్నారు. ఆయన వెంట ఏపీఎం గౌరిశంకర్, సీసీ ప్రవీణ, సీఏ మహేశ్వరి ఉన్నారు.

● **కౌడిపల్లి:** రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో లారీలను పంపిస్తామని మెదక్ జిల్లా డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట గేట్ సమీపంలో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం అకస్మికంగా తనిఖీ చేశారు. అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గానూ ఎప్పటికప్పుడు లారీలను పంపిణి చేస్తామన్నారు. ఆయన వెంట సీసీ నర్సింహులు, ఓబీ రాజేశ్వరి, శ్రీలత, రైతులు ఉన్నారు.

● **పెద్దశంకరంపేట:** మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేట తహసీల్దార్ గ్రేస్‌బాయ్ అకస్మికంగా తనిఖీ శారు. రైతుల నుంచి తొందరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ప్రభాకర్, పీఏసీఎస్ సీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కారవంతమైన విద్య శిశుమందిరాల్లోనే సాధ్యం

● కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్



మాట్లాడుతున్న సంగ్రాం మహరాజ్, పక్కన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ క్రిష్ణకుమార్

నారాయణఖేడ్, మే 21: సంస్కారవంతమైన విద్య సరస్వతీ శిశుమందిరాల్లోనే సాధ్యమని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిలభారత సాధు సంతుల రాష్ట్ర కమిటీ ప్రతినిధి సంగ్రాం మహరాజ్ పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేసవి సంస్కార సాధన వర్గ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులకు, చదువుతో పాటు సంస్కారం నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఖేడ్‌లోని శిశు మందిర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ క్రిష్ణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు తల్లిదండ్రులు వారి ఆసక్తికి అనుగుణంగా చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో 112 మంది విద్యార్థులు 21 రోజుల పాటు క్రమశిక్షణతో శిక్షణ పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రబంధకారిణి ఉపాధ్యక్షులు వీరేశలింగం, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లక్ష్మణ్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు వడితే ప్రసాద్, మేకల జ్ఞానేశ్వర్, పాఠశాల ప్రధానాచార్యులు భూమయ్య, పూర్వ ఆచార్యులు రాజయ్య, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువ పత్రాలు, భగవద్గీత పుస్తకాలను అందించారు.

23న గిరిజన గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్

కంగ్టి, మే 21: పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కంగ్టిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు మిగిలిన సీట్లకు ప్రవేశానికై ఈ నెల 23న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్‌రాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో పదోతరగతి పాసైన గిరిజన విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఏరియా సమన్వయ అధికారి కార్యాలయంలో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9849328298 నెంబరుకు సంప్రదించలన్నారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, మే 21: ఖేడ్ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఖాళీగా ఉన్న కొన్ని మైనారిటీ సీట్లతో పాటు ఇంటర్ ఫస్టియర్ ఎంఈసీ, సీఈసీ, గ్రూపుల్లో ప్రవేశాలకు గాను నేరుగా పాఠశాల, కళాశాలలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం 7995057963 నెంబరుకు సంప్రదించాలన్నారు.

సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు పూడికతీత

శివ్వంపేట, మే 21: మారుమూల గ్రామాల అభివృద్ధికి పలు గ్రామాల్లో సెహగల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కుల పటేల్ చెరువులో మంగళవారం సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ పథకంలో భాగంగా పూడిక తీత, కట్ట వెడల్పు పనులను ఎంపీపీ హరికృష్ణ ప్రారంభించారు. హరికృష్ణ మాట్లాడుతూ రైతులు ఉచితంగా మట్టిని తమ పొలాలకు తరలించి భూములను సారవంతంగా మార్చుకోవడానికి ఇది మంచి అవకాశమని సూచించారు.

ఖేడ్ డిపోలో ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు

నారాయణఖేడ్, మే 21: గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ రెండో విడతలో భాగంగా ఖేడ్ ఆర్టీసీ డీపోలో మూడు రోజులపాటు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు స్థానిక డీఎం మల్లేశయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. మొదటి రోజున వైద్యులు, వైద్య సిబ్బంది 110 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, పర్యవేక్షకులు, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బందికి 13 రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు.

గడిపెద్దాపూర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

అల్లాదుర్గం, మే 21: మండలంలోని గడిపెద్దాపూర్ శ్రీమల్లికార్జునస్వామి జాతరలో భాగంగా భక్తులు మంగళవారం బోనాలను సమర్పించుకున్నారు. భక్తులు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ దేవతకు, మల్లికార్జున స్వామి ఆలయం వద్ద పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఊట్ల టేకులకుంట కట్ట ధ్వంసంపై ఫిర్యాదు

జిన్నారం, మే 21: ఊట్ల గ్రామ పరిధిలో టేకులకుంట కట్ట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఊట్ల మత్స్య సహకార సంఘం నాయకులు మహేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ భిక్షపతిని కలిసి కుంట కట్టను ధ్వంసం చేయడంపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్ఐ జయప్రకాష్, సర్వేయర్ రామభద్రలు టేకులకుంటను సందర్శించి, సర్వే నిర్వహించారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం

జిన్నారం, మే 21: బొల్లారం మున్సిపాలిటీలో మరమ్మతుల కోసం ఈనెల 22న పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలోని గాంధీనగర్, బస్టాండు ఏరియా, ఎస్సీ కాలనీ, వెంకటరెడ్డినగర్ పోచమ్మ బస్తీ, జీపీవో ఏరియాలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● నారాయణఖేడ్, మే 21: నాగల్‌గిద్ద మండలం ఘూసల్‌పాడ్‌లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి వేయనున్నట్లు నారాయణఖేడ్ ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. అందువల్ల ఘూసల్‌పాడ్ 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

● శివ్వంపేట, మే 21: మండల పరిధిలోని కొత్తపేట సబ్‌స్టేషన్, పిల్లుట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఆ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అల్లీపూర్, కొత్తపేట, లింగోజిగూడ, రత్నాపూర్, పిల్లుట్ల, నానుతండా, సీతారాం తండా, గేమ్‌సింగ్ తండాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు మంగళవారం ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. సంబంధిత గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు కేతకీ హుండీ లెక్కింపు

ఝరాసంగం, మే 21: దక్షిణా కాశీగ ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. ఉదమం 11 గంటల నుంచి హుండీ లెక్కింపు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గడ్డపోతారం పంచాయతీ విభజనపై సమావేశం వాయిదా



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

జిన్నారం, మే 21: గడ్డపోతారం పంచాయతీ విభజనపై అధికారులు ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడింది. మంగళవారం గడ్డపోతారం పంచాయతీ కార్యాలయంలో విభజన అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ దృష్ట్యా అధిక మందితో సమావేశం నిర్వహించలేమని కోడ్ ముగిసిన అనంతరం సమావేశాన్ని చేపడతామని ఎంపీడీవో అరుణ తెలిపారు. అనంతరం ఎంపీడీవోను అల్లీనగర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యులు వీరేశంగౌడ్ తదితరులు కలిసి గడ్డపోతారం పంచాయతీ నుంచి అల్లీనగర్‌ను వేరు చేసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా పలువురు గడ్డపోతారం వాసులు పంచాయతీ విభజన అంశాన్ని ప్రజల సమక్షంలోనే జరుపాలని కొందరి అభిప్రాయం కాకుండా అందరి నుంచి సమాచారం సేకరించాలని కోరారు.

రాజీవునికి ఘన నివాళి



నర్సాపూర్‌లో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీఅధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు

మెదక్, మే 21. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. మంగళవారం మెదక్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నేత కొండన్ సురేందర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ ఆవారి శేఖర్, మాజీ కౌన్సిలర్లు మంగ మోహన్, మంగ రమేష్, నాయకులుహఫీజొద్దీన్, పవన్, గూడూరి ఆంజనేయులు, మున్నా, ముజీబ్, అశోక్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** దేశానికి ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని తెచ్చి దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్ గాంధీ నేటి తరానికి ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్ లలిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, నాయకులు పాల్గొన్నారు.

● **కొల్చారం:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు.

● **వెల్దుర్తి:** మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శేఖగౌడ్, మల్లేశంచారి తదితరులు పాల్గొన్నారు.

● **హత్నూర:** హత్నూర మండలం దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు స్వర్గీయ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కర్రె కృష్ణ ముదిరాజ్, మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, నాయకులు దుర్గంగౌడ్, పెంటేష్, నరేందర్ పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌లోని స్థానిక ఎమ్మెల్యే సంజీవ రెడ్డి స్వగృహ ఆవరణలో మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని న్యాయవాది బోజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశాభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కండెం నర్సింహులు, ఎస్సీసెల్ నాయకుడు చిన్న, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న బీబీపాటిల్



అమ్మవారి సన్నిధిలో బీబీపాటిల్

జహీరాబాద్, మే 21: మొగుడంపల్లి మండలంలో గల ఎల్లమ్మ ఆలయాన్ని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు మండల బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీబీపాటిల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డురకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలి

నారాయణఖేడ్, మే 21: దొడ్డు రకం ధాన్యానికి సైతం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తికి రైతుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతంతోపాటు రాష్ట్రంలో 90 శాతం వరకు దొడ్డు రకం ధాన్యాన్నే పండిస్తారన్నారు. దొడ్డు రకం ధాన్యంకు సైతం బోనస్ చెల్లించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, సతీష్, అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాం, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

'రైతులు అధైర్య పడొద్దు'

వెల్దుర్తి, మే21: రైతులు అధైర్య పడవద్దని, రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్దుర్తి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు మండలంలో 70 శాతంకు పైగా ధాన్యం కొనుగోలు పూర్తయినట్టు చెప్పారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉందన్నారు.


ఎంపీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీఈవో

అల్లాదుర్గం, మే 21 : అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎల్లయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నెలకొన్న పలు సమస్యలపై ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు.

మహిళకు రూ.2.25లక్షల ఎల్‌వోసీ అందజేత

మాసాయిపేట, మే 21: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన మహిళకు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.25 ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎల్‌వోసీని అందజేశారు. ఆయన వెంట మాసాయిపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీటీసీ వీరన్నగారి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూస్వామి, మెకానిక్ శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మక్తా భూపతిపూర్ క్రికెట్ లీగ్ సీజన్-2 విజేత ఎంబీపూర్ రైడర్స్



విజేత జట్టుకు ట్రోఫీని అందచేస్తున్న నిర్వాహకులు

మెదక్ కల్చరల్, మే 21: మండలంలోని మక్తాభూపతిపూర్ గ్రామంలో క్రికెట్ లీగ్ సీజన్- 2 మ్యాచ్‌లతో క్రీడా సందడి నెలకొన్నది. మూడు రోజులుగా జరిగిన మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భజరంగ్ వారియర్స్, ఎంబీపూర్ రైడర్స్ ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో ఎంబీపూర్ రైడర్స్ జట్టు విజయం సాధించింది. వారికి గ్రామ పంచాయతీ ఆఫీస్ ఆవరణలో టోర్నమెంట్ నిర్వాహకులు సంగారెడ్డి మల్లేశం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పరికి మల్లేశం, ఆకుల శ్రీనివాస్, ఇక్బాల్, శ్రీహరి, ఖుర్షీద్, రవి, ప్రభాకర్‌తో పాటు క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.